
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 9 డిసెంబరు 2025

మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో పని చేయాలి
● మెదక్ సాధారణ పరిశీలకులు భారతి లక్ష్మినాయక్ 7

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు
● వ్యయ పరిశీలకుడు రాకేశ్

అట్టహాసంగా రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రారంభం

● మంత్రులతో కలిసి హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ● సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి స్టాళ్ల పరిశీలన





మంత్రులతో కలిసి సమ్మిట్‌కు హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంత్రులతో కలిసి సమ్మిట్‌కు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2025లో స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి పరిశీలించారు. 2047 నాటికి తెలంగాణను ట్రిపుల్ మిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సమ్మిట్ కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభోత్సవం చేశారు. దేశ, విదేశాల్లో పేరు పొందిన కంపెనీల ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, లక్ష్మణ్, దామోదర్ రాజనర్సింహా, జూపల్లి, తుమ్మల, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుజ్జగింపులు

పలుచోట్ల రెబల్స్ బెడద

మూడో విడత నామినేషన్ల ఉపసంహరణకు నేడు ఆఖరు



నర్సాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణకు ఇంకా ఒకే రోజు మిగిలి ఉంది. నేటితో గడువు ముగియనుండగా, తమకు ఎదురులేకుండా చూసుకునేందుకు పలువురు అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. ప్రధాన పార్టీల మద్దతు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉండడంతో పలుచోట్ల రెబల్స్ బెడద తప్పలేదు. పలు గ్రామాల్లో ఒకే పార్టీకి చెందిన ఇద్దరు, ముగ్గురు సర్పంచ్‌గిరికి పోటీ చేస్తుండటంతో వారిని సమన్వయం చేసి ఒకరినే బరిలో నిలిపేందుకు ముఖ్య నాయకులు రంగంలోకి దిగారు. నామినేషన్లు ఉపసంహరించుకోవాలని బుజ్జగిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకగ్రీవాల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. పోటీ నుంచి తప్పుకునేందుకు ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నారు. ఎవరి ప్రయత్నాలు వారు సాగిస్తున్నారు. అంతిమంగా ఎవరు బరిలో నిలుస్తారో నేడు తేలనున్నది. ఆర్వోలు అభ్యర్థులకు నేడు గుర్తులను కేటాయించనున్నారు.

ఉపసంహరించుకున్న అభ్యర్థులు

వెల్దుర్తి/శివ్వంపేట : మెదక్ జిల్లాలోని వెల్దుర్తి మండల పరిధిలో సోమవారం ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు, ఒక వార్డు అభ్యర్థి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ మండలంలో ముగ్గురు సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. శివ్వంపేట మండలంలో సోమవారం ఐదుగురు సర్పంచ్ అభ్యర్థులు, 9 మంది వార్డు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు ప్రావీణ్య, రాహుల్‌రాజ్ సూచన



టేక్మాల్‌లో బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి రూరల్/టేక్మాల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, సంగారెడ్డి, మెదక్ కలెక్టర్‌లు ప్రావీణ్య, రాహుల్‌రాజ్ సోమవారం వేర్వేరు కార్యక్రమాల్లో ఈ మేరకు సూచించారు. మెదక్ జిల్లా టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని రాహుల్‌రాజ్ పరిశీలించి మాట్లాడారు. ప్రతీ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి దశ ఎన్నికల నిర్వహించనున్న మండలాల్లో ఉద్యోగులు మంగళవారమే సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని పేర్కొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి



సదాశివపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ విధులను ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సోమవారం సదాశివపేట మండలం మద్దికుంట వద్ద ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన శిక్షణ తరగతులను కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ ప్రక్రియలో పీవోలు క్రియాశీలకంగా వ్యవహరించాలని, నిబంధనలు పక్కాగా పాటించాలని ఆమె ఆదేశించారు. ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్‌ను ప్రతీ పీవో క్షుణ్ణంగా చదివి, స్పష్టమైన అవగాహనతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, ప్రిసైడింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు నిఘా కట్టుదిట్టం : సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తొలివిడత పోలింగ్ నిర్వహణకు నిఘా కట్టుదిట్టం చేశామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సదాశివపేట, కొండాపూర్ మండల పరిధిలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ ఆదేశించారు. పోలింగ్ కేంద్రానికి నిర్దిష్ట దూరంలో మార్కింగ్ చేయించి, ప్రచారం, గుర్తులను ప్రదర్శించడం నివారించాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు.

రారండోయ్..!

వలస ఓటర్లే కీలకం.. ఒక్క ఓటునూ వదలకుండా ప్రయత్నం

తొలివిడత పంచాయతీ పోరు తుది అంకానికి చేరుకున్నది. ఈనెల 11న పోలింగ్ నిర్వహించనుండగా నేటి సాయంత్రంతో ప్రచారం తెరపడనున్నది. ఇప్పటికే గ్రామాల్లో ఒక్కో ఇంటినీ, ప్రతీ ఓటరును నాలుగైదు సార్లు చుట్టేసిన అభ్యర్థులు తమ దృష్టిని వలస ఓట్లపై మళ్లించారు. జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిపై ఫోకస్ పెట్టారు. ఓటరు జాబితా ఆధారంగా వలస ఓటర్లను గుర్తిస్తూ ఫోన్లు చేస్తున్నారు.


రవాణా ఖర్చులు, తాయిలాలు

ఆన్‌లైన్‌లోనే ముందస్తుగా నగదు చేరవేత

ఎక్కువ సంఖ్యలో ఉంటే వాహనాల ఏర్పాటు

ఉమ్మడి జిల్లాలో లక్షకుపైగా వలస ఓటర్లు

నేటితో తొలివిడత ప్రచారం ముగింపు



సంగారెడ్డి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. తొలివిడత ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియకు మరో 48 గంటల సమయం మాత్రమే మిగిలింది. దీంతో సర్పంచ్, వార్డు అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. మిగిలిన సమయాన్ని ఓవైపు ప్రలోభాలకూ.. మరోవైపు వలస ఓటర్లను రప్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగానే వలస ఓటర్లు ఉంటారని అంచనా.

అభ్యర్థులకు కండీషన్లు

పల్లెల్లో హాట్‌హాట్‌గా ఎన్నికల హడావిడి ఉండడం.. అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్లుగా పోటీ నెలకొనడంతో వలస ఓటర్లు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. కొన్నిచోట్ల అభ్యర్థులకు వలస ఓటర్లే ఫోన్ చేసి తాము ఓటు వేయడానికి రావాలంటే రవాణా, ఇతర ఖర్చులు చెల్లించాలని అడుగుతున్నారు. ఇలా అందరు అభ్యర్థులకు కండీషన్లు పెడుతున్నారు. ఏ అభ్యర్థి ఫోన్ చేసినా వారికే మద్దతుగా మాట్లాడుతూ తమ ఫోన్‌పే నంబరు, అకౌంట్

మిగతా 7వ పేజీలో

నేటితో ప్రచారానికి తెర.. ఇక పంపిణీకి ఏర్పాట్లు

నేటితో తొలివిడత ఎన్నికల ప్రచారం ముగుస్తున్నందున ఇక ప్రలోభాలపై అభ్యర్థులు దృష్టి సారించారు. నేడు సాయంత్రం 5 గంటలకు మైకులు బంద్ అవుతాయి. బహిరంగ ప్రచారం చేస్తే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించమే. అందుకే గుట్టుచప్పుడు కాకుండా ఓటర్లను కలుస్తూ ప్రసన్నం చేసుకోవడంలో నిమగ్నం కావడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే మద్యం నిల్వలు తెచ్చిపెట్టుకున్నట్లుగా తెలుస్తోంది. ఎక్కడికక్కడ అభ్యర్థులు డబ్బు సైతం సమకూర్చుకున్నట్లుగా చర్చ జరుగుతోంది. అయితే ప్రత్యర్థుల ఎంతైతే పంపిణీ చేస్తారో అందుకు తగినట్లుగా పంపిణీ చేయడానికి అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

మెదక్ కలెక్టరేట్‌లో నేడు తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ



మెదక్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం

మెదక్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ప్రధాన ద్వారానికి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠాపనకు సిద్ధమైంది. నేడు అధికారికంగా ఆవిష్కరించనున్నారు. రెండు అడుగుల పీఠం, నాలుగు అడుగులతో దిమ్మెపై 12 అడుగుల ఎత్తుతో విగ్రహం ఉంటుంది. మంగళవారం ఉదయం మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎన్నికల నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

సీజన్‌లోనే అత్యల్పం

కోహీర్‌లో రాష్ట్రంలోనే రికార్డుస్థాయి కనిష్ఠ ఉష్ణోగ్రత

ఉమ్మడి జిల్లాలో 43 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ నమోదు



కోహీర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో సోమవారం చలికాంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో 6.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇది రాష్ట్రంలోనే అత్యల్పం. నవంబరు 29 నుంచి డిసెంబర్ 4 వరకు ఉష్ణోగ్రతలు మెరుగ్గానే నమోదు కాగా, మూడు రోజులుగా గణనీయంగా పడిపోయాయి. సోమవారం ఉదయం వేళ ఉమ్మడి జిల్లాలోని 43 ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 17 ప్రాంతాల్లో మెదక్ జిల్లాలో 16, సిద్దిపేట జిల్లాలో 10 ప్రాంతాల్లో పదిలోపు డిగ్రీలకు చేరింది.

సంగారెడ్డి జిల్లాలో... కోహీర్ 6.6, న్యాల్‌కల్ 7.5 ఝరాసంఘం 7.6 మొగుడంపల్లి 7.6 సత్వార్ 8.2 అల్గోల్ 8.3 నిజాంపేట్ 8.6 నల్లవల్లి 8.7, కడ్పల్ 9.0, దిగ్వాల్ 9.1, జహీరాబాద్ 9.2, మల్‌చేల్మ 9.4 పుల్కల్ 9.4 సిర్గాపూర్ 9.6, కంగ్టి 9.6, జిన్నారం 9.6 రాయికోడు 9.8 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో.... శివ్వంపేట్ 8.4, దామరంచ 8.6 కాగజ్‌మద్దూర్ 9.1, వెల్దుర్తి 9.2, సర్దన 9.3, డి.ధర్మారం 9.3, వాడి 9.3, కొత్తపేట్ 9.4, కుల్చారం 9.5, శంకరంపేట(ఎ) 9.5, నాగపూర్ 9.6 శివనూర్ 9.6, నర్సాపూర్ 9.7, రాజ్‌పల్లి 9.8 చిప్పల్‌తుర్తి 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

సిద్దిపేట జిల్లాలో.... బేగంపేట్ 8.9, అంగడికిష్టాపూర్ 8.9, పోతిరెడ్డిపేట్ 8.9, తిప్పారం 9.0, నంగునూరు కొండపాక 9.1, అక్బర్‌పూర్ 9.5, గౌరారం 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతను నమోదు అయ్యాయి.

పిచ్చి కుక్కల స్వైర విహారం.. పది మందికి గాయాలు

సదాశివపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలో సోమవారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. ప్రయాణికులను, విద్యార్థులను, మహిళలను తీవ్ర భయాందోళనకు గురి చేశాయి. ఒకే రోజు పట్టణంలో తిలక్ రోడ్, గాంధీరోడ్, 24వ వార్డులో వీధి కుక్కలు దాదాపు 10 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తీవ్ర రక్తస్రావంతో వారంతా ఆసుపత్రుల పాలయ్యారు. 24వ వార్డులో మోముల లాస్య, జంగిలి అర్జున్, జోహన్, రినాస్ వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. కుక్కకాటుకు గురైన బాధితులకు ఏదైన ప్రాణనష్టం జరిగితే బాధ్యులెవరని 24వ వార్డు మాజీ కౌన్సిలర్ ఖలీం పాటిల్ బల్దియా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వీధి కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని సోషల్ మీడియాలో ప్రజలు నిలదీశారు.




సదాశివపేటలో వీధికుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు

మోడల్ స్కూళ్ల హాస్టల్ బాధ్యతలు ఇక కేర్ టేకర్లకు..

● కేజీబీవీ ఎస్‌వోలను తప్పించిన విద్యాశాఖ ● సమగ్ర శిక్ష ఎస్‌పీడీ ఉత్తర్వులు జారీ



మోడల్ స్కూళ్లకు అనుబంధంగా చేగుంటలో ఏర్పాటు చేసిన బాలికల వసతిగృహం

మెదక్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మోడల్ స్కూళ్లకు అనుబంధంగా ఉన్న బాలికల వసతిగృహ పర్యవేక్షణ బాధ్యతల నుంచి కస్తూర్బా విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్లను తప్పించింది. ఇక నుంచి నిర్వహణ బాధ్యత కేర్ టేకర్, వార్డెన్లదేనని స్పష్టం చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు డీపీవో, అకౌంట్స్ ఆఫీసర్, ఫైనాన్స్, సమీప కేజీబీవీ ఎస్‌వో నిర్వహించే బాలికల వసతిగృహ ఉమ్మడి ఖాతాను ఇక డీపీవో ఫైనాన్స్, అకౌంట్స్, మోడల్ స్కూళ్లకు అనుబంధంగా ఉన్న కేర్ టేకర్ కమ్ వార్డెన్ నిర్వహించనున్నారు. బాలికల వసతి గృహ ప్రాంగణాల శుభ్రతను మోడల్ స్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పారిశుధ్య కార్మికులు చూడనున్నారు. మోడల్ నిర్వహణ నిర్ధారించే బాధ్యతలను ప్రిన్సిపళ్లకు అప్పగించారు. చిన్న మరమ్మతులు, ఇతర సమస్యల పరిష్కార బాధ్యతలు కేర్ టేకర్ కమ్ వార్డెన్‌తో పాటు ప్రిన్సిపల్స్, ఎంఈవో, జిల్లా జెండర్ అండ్ ఈక్విటీ కో-ఆర్డినేటర్లతో కూడిన నలుగురు సభ్యుల కమిటీ చూడనుంది. 15 రోజులకోసారి స్వయంగా సందర్శించాలి. విద్యార్థినులతో వారానికోసారి సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ప్రత్యేక అధికారులకు ఊరట

మోడల్ స్కూళ్లకు అనుబంధంగా ఉన్న బాలిక హాస్టల్ నిర్వహణలో విద్యాశాఖ కీలక మార్పు చేసింది. ఇప్పటివరకు ఈ వసతి గృహాల ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న కేజీబీవీ ప్రత్యేక అధికారులను ఆ బాధ్యతల నుంచి మినహాయించారు. 2018లో ప్రిన్సిపాళ్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ జరిపిన కోర్టు వసతి గృహ పర్యవేక్ష బాధ్యత నుంచి తప్పించాలని 2019 జనవరిలో తీర్పు వెలువరించింది. ఆ తీర్పును అమలు చేస్తూ.. సమీప కేజీబీవీల ఎస్‌వోలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అప్పట్లోనే ఆదర్శ పాఠశాలకు అనుబంధంగా ఉన్న బాలికల హాస్టల్ బాధ్యతలు అప్పగించడంతో వారు ఆందోళన వ్యక్తంచేశారు. అదనపు బాధ్యతలతో పని భారం మోపడాన్ని ఉపాధ్యాయ సంఘాలు తప్పుబట్టాయి. వసతి గృహాలు దూరంగా ఏర్పాటు చేయడంతో నిర్వహణ కష్టతరంగా మారింది. ఎట్టకేలకు హాస్టల్ నిర్వహణ బాధ్యతలను నుంచి మినహాయింపు ఇవ్వడం ఎస్‌వోలకు ఊరటనిచ్చింది.

‘స్థానికం’తో మొదలై.. అంచెలంచెలుగా ఎదిగి..

ఏకగ్రీవ సర్పంచ్ నుంచి డిప్యూటీ స్పీకర్ వరకు ఐరేని లింగయ్య

సర్పంచ్ నుంచి మంత్రి వరకు వెలిగిన ‘ముత్యం’ 7

రాజ్యసభ సభ్యుడి దాకా సోలిపేట రామచంద్రారెడ్డి ప్రస్థానం

కోతుల దాడిలో ముగ్గురికి.. 6

కుక్కల బెడద తీర్చే వారికే మా ఓటు

గ్రామాల్లో తేల్చి చెబుతున్న ఓటర్లు

హామీ ఇవ్వాలని ప్రజలకు డిమాండ్ 7

600 చీరలు స్వాధీనం

పెద్దశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పెద్దశంకరం పేట మండలం వీరోజిపల్లి గ్రామంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తీసుకువచ్చిన 600 చీరలను పోలీసు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుంది. సోమవారం సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, వాహనంలో 600 చీరలు తరలిస్తుండగా పట్టుకున్నారు. గ్రామ సర్పంచ్ అభ్యర్థి మన్నె కృష్ణ హైదరాబాద్ నుంచి ఈ చీరలను తరలిస్తున్నారని సీఐ తెలిపారు.

పోరాటాల తీవ్రత పెంచాలి

- కార్మికులు ఎందుకు గుర్తించడం లేదు..
- సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్
- రెండో రోజు కొనసాగిన సీఐటీయూ మహాసభలు

మెదక్ కల్చరల్, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి) ధిక్కరణ, ప్రతిఘటనల నినాదాలతో పోరాటాల తీవ్రతను పెంచాలని సీఐటీయూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపునిచ్చారు. మెదక్ పట్టణంలో జరుగుతున్న సీఐటీయూ ఐదో రాష్ట్ర మహాసభలలో రెండో రోజు ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల తీవ్రతను పెంచాలని అన్నారు. కార్మికులు సృష్టించిన సంపద, ఖనిజాలను కారు చౌకగా కార్పొరేట్లు ప్రభుత్వంలోని వారి ఏజెంట్ల ద్వారా దోచుకుంటున్నారని, వారికి వ్యతిరేకంగా దేశ కార్మికవర్గాన్ని ఐక్యం చేయటమే లక్ష్యంగా సమరశీల పోరాటాలు చేయాలన్నారు. 'దేశాన్ని రక్షించుకుందాం- ప్రజలని రక్షించుకుందాం' అనే స్ఫూర్తితో మహాసభలో తీర్మానాలు చేశామన్నారు. 76ఏండ్ల స్వాతంత్ర భారతంలో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదవీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. పాలకులు స్వప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని విమర్శించారు. ఇందుకు మీడియాను, ఇతర ఏజెన్సీలను వినియోగించుకుంటున్నదని, తద్వారా అబద్దాలను ప్రచారం చేస్తు నిజమని భ్రమ కల్పిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం నయాఫాసిస్టు ధోరణితో పాలన కొనసాగిస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం ప్రమాదంతో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో మన ఆలోచన, మారుతున్న ప్రస్థితులను ఎదుర్కోవాలంటే.. ఖచ్చితమైన ప్రణాళిక అవసరమన్నారు. పోరాటాలతోనే సరిపెట్టకుండా ప్రజల ప్రయోజనాలను, వసతులపై దృషిట పెట్టాలని సూచించారు. పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాల్లో కేసుల పాలవుతున్నామని, జైళ్లకు వెళ్తున్నామని, అయినా.. కార్మికులు మనల్ని ఎందుకు గుర్తించడం లేదో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కార్మికుల మధ్య అనైక్యతను పెంచేందుకు కులం, మతం, ప్రాంత విభేదాలను సృష్టిస్తున్నారని ఈ కుట్రలను కార్మికులు. ప్రజలు అర్థం చేసుకునేలా చైతన్యాన్ని కల్పించాలని అన్నారు. లేబర్ కోడ్ల విషయంలో ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకించాయి దీనికి కారణం కూడా కార్మిక ఐక్య ఐక్యత. కర్నాటకలో ఒక రోజు సమ్మెతో 12 గంటల పనివిధానాన్ని తిప్పికొట్టిన విషయాన్ని గుర్తు చేశారు.పోరోటాలు, ఆందోళనలను మరింత ఉధృతం చేసేందుకు తగిన విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో చుక్క రాములు, ఎస్వీ రమ, భూపాల్, జె మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ కార్యవర్గ సభ్యులు



గుండెపోటు కాదు...ఆత్మహత్య

- పోస్టుమార్టం నివేదికలో తేలిన వాస్తవం

కొండాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ టీచర్ శ్రీనివాస్ తనభార్య సుచిత గుండెపోటుతో మృతిచెందినట్లు చెప్పిన మాట అవాస్తమని తేలింది. ఇంట్లో ఉరేసుకోవడంతో మృతిచెందినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. కొండాపూర్ సీఐ సుమన్ వివరాల ప్రకారం... ప్రభుత్వ టీచర్ అయిన శ్రీనివాస్ అతని భార్య సుచితలు మల్కాపూర్‌లో నివాసముంటున్నారు. కొంతకాలంగా ఆస్తి విషయమై గొడవపడేవారు. ఆదివారమూ గొడవపడ్డారు. సుచిత ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన భర్త శ్రీనివాస్ ఏంచేయాలో తెలియక ఆమె గుండెపోటుతో మృతిచెందినట్లు బంధువులకు తెలిపాడు. అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలో సుచిత మెడ చుట్టూ మరకలు, ఇతర ఘాట్లు ఉండటం గమనించిన బంధువులకు అనుమానం వచ్చి కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుచిత మృతదేహానికి సోమవారం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఉరేసుకోవడం వల్లనే సుచిత మృతిచెందినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సుమన్‌కుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

లక్షన్నర నగదు పట్టివేత

కల్హేర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కల్హేర్, మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామాల నడుమ రహదారిపై బైకుపై తీసుకెళ్తున్న రూ.1.50 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రవిగౌడ్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సంగున్‌గారి అఖిల్‌గౌడ్ తన ద్విచక్ర వాహనంపై మాసాన్‌పల్లి చౌరస్తా నుంచి కల్హేర్ వైపు వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. దీంతో లక్షన్నర నగదు లభించడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజలతో మమేకం కోసమే 'ప్రజావాణి'

- సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలతో మరింత మమేకం కావడం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంగారెడ్డి ఎస్పీ పంకజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల ఆర్జీదారుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులు చెప్పిన సమస్యలను ఓపికగా విన్నారు. సమస్య పరిష్కారం కోసం స్థానికంగానే కృషి చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజావాణి ద్వారా సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని ఎస్పీ వెల్లడించారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసులకు ఫోన్‌లో ఆదేశించారు.

మద్యం బాటిళ్లు సీజ్

- కేసు నమోదు చేసుకున్న పోలీసులు

వట్‌పల్లి/వెల్దుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్, వట్‌పల్లి ఎస్‌ఐ లవకుమార్ సోమవారం తెలిపారు. వట్‌పల్లి నుంచి మండలంలోని పోతులబొగుడ గ్రామానికి అక్రమంగా కారులో మద్యం తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారంతో ఆ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.1.02 లక్షల విలువ చేయడంతో 117 లీటర్ల మద్యం పట్టుబడిందన్నారు. అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. వెల్దుర్తి మండలంలోని కుకునూర్ గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ కిరాణ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన 3.24 లీటర్ల మద్యాన్ని ఎలుకపల్లి గ్రామం మీదుగా మరో వ్యక్తి యశ్వంతరావు పేట గ్రామం వైపు తరలిస్తున్న 34 బీరు బాటళ్లను పట్టుకొని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యవస్థను సవ్యదిశలో నడిపే రచనలు రావాలి

- కలవార కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభ



కలవార పుస్తకావిష్కరణ దృశ్యం

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాల ప్రవాహంలో పడి కొట్టుకుపోయే వారికంటే, కాలంకన్నా ఒకక్షణం ముందు నిలబడి రాబోయే ఉపద్రవాన్ని పసిగట్టి సమూహాన్ని అప్రమత్తం చేసేవారే కవులు రచయితలుగా నిలదొక్కుకోగలుగుతారని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సీనియర్ కవి మహమూద్ పాషా కవిత్వ సంపుటి కలవార ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మూడు దశాబ్దాల క్రితమే ప్రపంచీకరణ ప్రభావం వల్ల రాబోయే పరిణామాలను, పర్యవసానాలను గమనించిన కవులు, రచయితలు తమ రచనల ద్వారా ముందస్తు హెచ్చరికలు చేస్తే అందరూ తేలికగా కొట్టిపారేశారని, ఇప్పుడు అన్నివైపుల నుంచి చాపకింద నీరులా తన్నే తప్పా దాని దుష్ప్రరిణామాలు తెలిసిరాలేదన్నారు. సీనియర్ కవి మహమూద్ పాషా 40 ఏళ్లుగా సాహిత్య సేద్యం చేస్తూ తన రెండవ పుస్తకంగా కలవారను ప్రచురించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్కపెల్లియాదగిరి, గఫూర్ శిక్షక్, కార్యదర్శులు ఉప్పలపద్మ, ఆడెపు లక్షణ్, తౌడబోయిన తిరుపతి, వంగర నరసింహారెడ్డి, అశోక్ రాజు, కొమురవెల్లి అంజయ్య, స్రవంతి మహిపాల్, మోర మోహన్, త్రివిక్రమశర్మ, ఉమాశంకర్, మహేందర్, సుధాకర్, శ్రీధర్, ఎడ్ల లక్ష్మి, వెంకటేశ్వర్లు, సాజిత్, సర్దార్ హుస్సేన్, కవులు రచయితలు సాహిత్యాభిమానులు, మహమూద్ పాషా బంధుమిత్రులు పాల్గొన్నారు.

51 మంది బైండోవర్

మనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మనూరు మండలంలోని గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లో మద్యం విక్రయిస్తున్న వారిపై మూడు కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం బెల్లాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా 51 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పాముకాటుతో యువ రైతు మృతి

మాసాయిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో యువరైతు మృతిచెందాడు. మాసాయిపేటకు చెందిన దొంతి ఆంజనేయులు(44) సోమవారం ఉదయం చెట్లతిమ్మాయిపల్లి శివారులోని తన పొలం వద్ద పనిచేస్తూ పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గడ్డం మానయ్య(42) కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మనోవేనకు గురై మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్‌ఐ నారాయణగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడి భార్య సంపూర్ణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోతుల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలు

చేగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోతుల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. చేగుంటకు చెందిన పూలబోయిన యాదమ్మ, బీ.స్వప్న, మురడి స్వామిపై సోమవాం కోతులు దాడిచేశారు. చేగుంటలో ప్రథమ చికిత్స అనంతరం వారిని మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చేగుంటలో కోతుల బెడద ఉండడంతో రోజు ఏదో ఒకచోట దాడి చేస్తూనే ఉన్నాయి. కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ ధ్వంసం

మనోహరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ ధ్వంసమైన సంఘటన కాళ్లకల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చీర్ల మల్లేష్‌యాదవ్ గ్రామంలోని తన పొలం నుంచి ట్రాక్టర్‌లో గడ్డిని నింపుకుని వస్తున్నాడు. హనుమాన్ ఆలయం వద్ద విద్యుత్ వైర్లు తగిలి ట్రాక్టర్ ట్రాలీ, గడ్డి దగ్ధమైంది. సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

రైస్‌మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

జోగిపేట రూరల్, డిసెంబర్8 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించిన ఘటన అందోల్ మండంలో జోగిపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్ మండలం జోగిపేట పట్టణంలోని సత్యవతి ట్రేడర్స్ అనే రైస్ మిల్లు లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో స్థానిక పోలీసుల తో కలిసి సోమవారం రైస్ మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపారు. సుమారు 45సంచుల బియ్యాన్ని ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు మంగళవారం వచ్చి ఆ బియ్యాన్ని పరిశీలించనున్నట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు.

చోరీకి గురైన 110 మొబైల్ ఫోన్ల రికవరీ

మెదక్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా పరిధిలో ఇటీవలి కాలంలో దొంగతనానికి గురైన 110 మొబైల్ ఫోన్లను గుర్తించి, వాటిని బాధితులకు సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. మొబైల్ ఫోన్లు చోరీకి గురైన పౌరులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. మొబైల్‌ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్పీతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఐటీకోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
















'స్థానికం'తో మొదలై.. అంచెలంచెలుగా ఎదిగి..

● ఏకగ్రీవ సర్పంచ్ నుంచి డిప్యూటీ స్పీకర్ వరకు ఐరేని లింగయ్య
● సర్పంచ్ నుంచి మంత్రి వరకు వెలిగిన 'ముత్యం'
● రాజ్యసభ సభ్యుడిగా 'సోలిపేట' ప్రస్థానం



దుబ్బాక నియోజకవర్గ మ్యాప్

దుబ్బాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పల్లెలు దేశానికి పట్టుగొమ్మలంటారు.. పల్లెలను ఏలినవాళ్లకు పాలనపై పట్టు ఉంటుందంటారు. అలాంటి పల్లెల నుంచి అంచలంచెలుగా ఎదిగిన నలుగురు ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రజా జీవితంలో తమదైన అభివృద్ధిని లిఖించారు. వారే దివంగత నేత, డిప్యూటీ సీఎం ఐరేని లింగయ్య, మాజీ రాజ్యసభ సభ్యుడు, దివంగత నేత సోలిపేట రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి, దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డి.

ధిక్కార స్వరం ఐరేని లింగయ్య



తెలంగాణ విముక్తి పోరాటంలో పాల్గొన్న ఐరేణి లింగయ్యను 1952లో అప్పటి బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం దుబ్బాకకు సర్పంచ్‌గా నామినేట్ చేసింది. ఆ తర్వాత కాంగ్రెస్ కీలక రాజకీయాల్లో పాల్గొన్నారు. 1958లో నీలం సంజీవరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్ (శాసనమండలి) ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆయన మూడుసార్లు (1978 వరకు) ఎమ్మెల్సీగా కొనసాగారు. 1978లో అప్పటి దొమ్మాట(ప్రస్తుత దుబ్బాక) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా బరిలో నిలపగా టీజేపీ అభ్యర్థి సీ.రామారావుపై గెలుపొందారు. 1983లో టీడీపీ గాలిలో కూడా ఆయన దొమ్మాట నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు.

కొట్లాడి డిప్యూటీ స్పీకర్ పదవి

పల్లె పోరు

దుబ్బాక- సిద్దిపేట నియోజకవర్గాల మధ్య మొదటి నుంచే రాజకీయ వైరం ఉండేది. అది ఎమ్మెల్యే ఐరేణి లింగయ్య కాలం నుంచే ప్రారంభమైంది. తనకంటే జూనియర్ అయిన సిద్దిపేట ఎమ్మెల్యే అనంతుల మదన్‌మోహన్‌కు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి పదవి ఇవ్వడంతో లింగయ్య కాంగ్రెస్‌పై కినుకు వహించారు. 1982లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సీఎంగా ఉండి లింగయ్యకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారు. ప్రోటోకాల్ ప్రకారం అనంతుల మదన్‌మోహన్ మంత్రిగా డిప్యూటీ స్పీకర్ ఐరేణి లింగయ్యకే గౌరవం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఐదో తరగతి వరకు చదివిన ఐరేణి లింగయ్య డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు.

దుబ్బాక అభివృద్ధిలో తనదైన ముద్ర

మూలగట్టు ప్రాంతంగా వివక్షకు గురైన దుబ్బాకకు లింగయ్య అభివృద్ధి బాటలు వేశారు. సర్పంచ్‌గా దుబ్బాక నుంచి హబ్షీపూర్ రహదారికి బాటలు వేశారు. దుబ్బాక తాలుకాను, దుబ్బాక సమితిని ఏర్పాటు ఏర్పాటు చేశారు. తాను ఎమ్మెల్యేగా దుబ్బాకలో డాగ్‌బంగ్లా నిర్మాణం, తహసీల్దార్ కార్యాలయం, గ్రంథాలయం ఏర్పాటు, 20 పడకల ఆసుపత్రి ఏర్పాటు, బ్లాక్ ఆఫీస్ కార్యాలయం (ప్రస్తుత కోర్టు భవనం), పాత బస్టాండ్ నిర్మాణం, గ్రామపంచాయతీ భవన నిర్మాణం ఆయన హయాంలోనే జరిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో కేవలం దుబ్బాక మండలం రామక్క పేటలో గురుకుల బాలికల పాఠశాలను ఏర్పాటు చేయించారు.

ఉద్యమకారుడు సోలిపేట రామచంద్రారెడ్డి



సోలిపేట రామచంద్రారెడ్డి అప్పటి దుబ్బాక మండలం (ప్రస్తుతం అక్బర్‌పేట-భూంపల్లిమండలం) చిట్టాపూర్ మొదటి సర్పంచ్‌గా 24 ఏళ్లకే రాజకీయ ప్రస్థానం చేశారు. 1955 నుంచి 1965 వరకు సర్పంచ్‌గా అనేక సేవలందించారు. విద్యార్థి దశలోనే సోషలిస్టు భావజాలానికి ఆకర్షితుడైన రామచంద్రారెడ్డి తొలితరం కమ్యూనిస్టుగా ఆనాడు ఉధృతంగా సాగుతున్న తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత దుబ్బాక సమితి అధ్యక్షుడిగా ఉన్నారు. రెండేళ్లపాటు సిద్దిపేట వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. 1972లో కాంగ్రెస్ తరపున దొమ్మాట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కొంతకాలం మెదక్ జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా, ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆ తర్వాత రామచంద్రారెడ్డి టీడీపీ నుంచి రాజ్యసభకు ఎంపికై 1996-2002 వరకు ఫ్లోర్‌లీడర్‌గా ఉన్నారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో పంచాయతీ, మండల వ్యవస్థ రూపకల్పనలో ప్రధానపాత్ర పోషించారు. టీడీపీలో చంద్రబాబుకు కూడా మంచి సలహాదారులుగా కొనసాగారు. దివంగత ప్రజాకవి సీ.నారాయణరెడ్డి వియ్యంకుడిగా ఇద్దరూ టీడీపీలో కీలకంగా పనిచేశారు.

పల్లెకు అభివృద్ధిని రప్పించిన 'ఆణిముత్యం'



పల్లెకు అభివృద్ధిని రప్పించిన ఆణిముత్యం దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి. 1969-1988 వరకు తొగుట సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం చేశారు. 1988-1989 ఉమ్మడి మెదక్ జిల్లా కోఆపరేటివ్ డైరెక్టర్ పనిచేసిన ఆయనను 1989లో అనూహ్యంగా టీడీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దింపే అవకాశం వచ్చింది. 1989-2004 వరకు దొమ్మాట ఎమ్మెల్యేగా, 2002- 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాలశాఖ మంత్రిగా పనిచేశారు. 2005-2006 వరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, 2007-2009 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా పనిచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయన 2009-2014 దుబ్బాక ఎమ్మెల్యేగా, రెండు పర్యాయలుగా అంచనాల కమిటీ చైర్మన్‌గా, రెండు పర్యాయాలుగా తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్ సేవలందించారు.

అప్పుడు భార్యలు.. ఇప్పుడు భర్తలు..

● అల్లాపూర్ సర్పంచ్ బరిలో...



అంకెన్‌పల్లి నారాయణ, కొల్యాకారి శంకరయ్య

మునిపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అల్లాపూర్ గ్రామం మల్లికార్జున్‌పల్లి అమ్లేట్ విలేజ్‌గా ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నూతన గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా 2019లో అల్లాపూర్ గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. 2019 సర్పంచ్ ఎన్నికల్లో బీసీ మహిళా రిజర్వేషన్ రావడంతో అంకెన్‌పల్లి నాగరాణి(బీఆర్ఎస్), కొల్యాకారి విశ్వజ్యోతి(కాంగ్రెస్) నుంచి బరిలో నిలవగా.. 244 ఓట్ల మెజార్టీలో నాగరాణి గెలుపొందింది. అనంతరం జరిగిన పరిణామాల వల్ల మాజీ సర్పంచ్ నాగరాణి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అప్పుడు భార్యలు పోటీలో ఉంటే ఇప్పుడు వారి భర్తలైన అంకెన్‌పల్లి నారాయణ, కొల్యాకారి శంకరయ్య ఇద్దరూ కాంగ్రెస్ మద్దతుతో బరిలో నిలిచారు. ఇటు నారాయణ మాత్రం ఐదేళ్లపాటు చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని ధీమాతో ఉండగా.. అటు శంకరయ్య మాత్రం గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని ప్రచారం చేస్తున్నారు. మరి ప్రజలు ఎవరిని గెలిపిస్తారో వేచిచూడాలి.

కుక్కల బెడద లేకుండా చేసే వారికే మా ఓటు

● గ్రామాల్లో తేల్చి చెబుతున్న ఓటర్లు


కల్హేర్‌లో నివాస గృహాల మధ్య సంచరిస్తున్న కుక్కల గుంపులు

కల్హేర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు అడిగేవారు ముందు కుక్కలు, కోతుల బెడద తొలిగిస్తామని మాట ఇస్తేనే తాము ఓటు వేస్తామని అధికశాతం గ్రామాలకు చెందిన ఓటర్లు తమ మనోగతాన్ని బయటపెట్టారు. కుక్కల గుంపుల సంచారం ఫలితంగా కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని అధికశాతం గ్రామాల్లో చిన్నారులను, వృద్ధులను, మహిళలను కుక్కలు కరవడంతో తీవ్రగాయాలైన సంఘటనలూ ఉన్నాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే ఏ పార్టీ అభ్యర్థి అయినా తమ గ్రామాల్లో సర్పంచ్‌గా ఎన్నికయ్యాక కుక్కలు, కోతుల బెడద తొలిగించాల్సిందేనని ఓటర్లు అంటున్నారు. ఈ మేరకు ముందుగా హామీఇవ్వాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు.

పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం


నరసింహులపల్లిలో నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆర్వో

బెజ్జంకి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన మండలంలోని నరసింహులపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గసభ్యులచే సోమవారం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ డీ.సుధాకర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్‌గా జెట్టి రమేష్, ఉపసర్పంచ్‌గా జెట్టి శ్రీకాంత్, వార్డుసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకవర్గసభ్యులు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'పల్లె' పోరుపై యువత గురి

● సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఆసక్తి
● ఎక్కువ స్థానాలో బరిలో నిలిచిన మహిళలు

తొగుట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకు రావడానికి యువత ఆలోచించి పల్లెపోరులో బరిలోకి దిగారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని 17 గ్రామపంచాయితీలకు ఈనెల 14న రెండోవిడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 58 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవి కోసం పోటీలో నిల్చున్నారు. అందులో అత్యధికంగా 25-40 ఏళ్లలోపు ఉన్నవారు పోటీలో నిలబడటం విశేషం. మండలంలోని తొగుట, తుక్కాపూర్, గోవర్ధనగిరి, గుడికందుల, లింగంపేట, చందాపూర్, బండారుపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో మొదటిసారి కొందరు మహిళలు పోటీలో నిలబడుతుండగా పెద్దమాసాన్‌పల్లి, రాంపూర్, కాన్గల్, ఎల్లారెడ్డిపేట, వర్ధరాజ్‌పల్లి, జప్తిలింగారెడ్డిపల్లి, ఘనపూర్, లింగాపూర్, ఎల్ బంజర్‌పల్లి గ్రామాల్లో యువకులు సర్పంచ్ పదవి కోసం మొదటిసారి బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రాజకీయం యువతీ, యువకుల చుట్టూ తిరుగుతుంది. గతంలో 40-50 ఏళ్ల పైబడిన వారు మాత్రమే సర్పంచ్ పదవిలో ఏళ్ల తరబడి కొనసాగేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీనికితోడు చదువుకున్న వారు, నిరుద్యోగులు రాజకీయాల్లో పట్టు నిలుపుకునేందుకు పోటీపడుతున్నారు.

రారండోయ్..!

(5వ పేజీ తరువాయి)

వివరాలను పంపిస్తున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే వలస ఓటర్లకు రూ.1000 నుంచి రూ.3 వేల దాకా పంపించిన పరిస్థితి కనిపిస్తోంది. తమ పనులు వదిలి రావాల్సి ఉంటుందని.. ఆ డబ్బుతోపాటు ఓటుకు కొంత సైతం వసూలు చేస్తున్నారు. అభ్యర్థులు కూడా కిమ్మనకుండా అడిగినంత ఇస్తున్నారు.

ప్రతీ ఓటుపై దృష్టి

గ్రామ పంచాయతీ, వార్డు ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే. గతంలో జరిగిన ఎన్నికల్లో ఒకటి రెండు ఓట్లతోనే ఓడిపోయిన అభ్యర్థులు ఉన్నారు. ముఖ్యంగా వార్డుల్లో ఒక్క ఓటు కూడా ప్రభావం చూపిస్తుంది. హోరాహోరీగా పోటీ ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు ప్రతీ ఓటుపై దృష్టి సారించారు. గ్రామాల్లో ఉన్న ఓటర్లకు అందరితో సమానంగా డబ్బు, మద్యం అందించి.. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారి విషయంలో పెద్ద మనసు చేసుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్‌తోపాటు బెంగళూరు, బీదర్, ముంబయి, బీవండి, సూరత్, నాగ్‌పూర్, నాందేడ్ నగరాల్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎక్కువమంది బతుకుదెరువు కోసం తరలివెళ్లారు. వీరి ఓట్లన్నీ గ్రామాల్లోనే ఉన్నాయి. ఓటర్ల సంఖ్య ఆధారంగా ప్రత్యేక వాహనాలను సైతం ఏర్పాటు చేయిస్తున్నారు. హైదరాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల వద్దకు స్వయంగా అభ్యర్థులే వెళ్లి ఖర్చులు సమర్పించుకొని వస్తున్నారు. ఒక్క ఓటు తేడాతో ఓడిపోతే పెట్టిన ఖర్చులతోపాటు తమ రాజకీయ జీవితం కూడా ఇరకాటంలో పడుతుందని ప్రతీ ఓటును ప్రాధాన్యంగా తీసుకుంటున్న పరిస్థితి ప్రస్తుత ఎన్నికల్లో కనిపిస్తోంది.

కాళ్లు మొక్కుతా... కనికరించి ఓటే వేయండి..


హైదరాబాద్‌లో ఓటరు కాళ్లు మొక్కుతున్న అంజనేయులుగౌడ్

చేర్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పలువురు అభ్యర్థులు వినూత్న ప్రచారం చేస్తూ ఆకర్షిస్తున్నారు. చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన పలువురు వలస ఓటర్లు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గ్రామంలో 8వ వార్డు స్థానానికి పోటీచేస్తున్న పంజాల అంజనేయులు సోమవారం హైదరాబాద్ ప్రాంతంలోని తమ గ్రామ వలస ఓటర్లను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. సన్నిహితంగా మెదలిన వారి పట్ల కాళ్లు మొక్కి తనకే ఓటేయాలని ప్రాథేయపడ్డారు. విషయాన్ని స్థానికులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

● పంచాయతీ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేశ్


మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేశ్

పుల్‌కల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణలో సజావుగా జరిగేలా సహకరించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేశ్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్ రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్, వార్డు పదవులకు పోటీచేస్తున్న అభ్యర్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50 లక్షలు, వార్డు అభ్యర్థులు రూ.30 వేలు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్టయ్య, ఎంపీడీవో కే.శంకర్, మండల ఎన్నికల వ్యయ పరిశీలకులు నిరంజన్, మండల ప్రత్యేకాధికారి వసంతకుమారి, ఎంపీవో సువర్ణ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, అకౌంట్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధన మేరకే ఖర్చు చేయాలి

చేగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో పోటీచేసే ప్రతీ అభ్యర్థి ఎన్నికల ఖర్చులు బ్యాంకు ద్వారా లావాదేవీలు జరపాలని మండల ఎన్నికల ఎక్స్‌పెండేచర్ అధికారి శ్రేయ పేర్కొన్నారు. సోమవారం చేగుంట రైతువేదికల్లో మండలంలోని సర్పంచ్, వార్డు అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఖర్చులపై ఎంపీడీవో చిన్నారెడ్డితో కలిసి పోటీచేసే అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, వివిధ గ్రామాల సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భారతి లక్ప్తినాయక్

మెదక్ అర్బన్/మెదక్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల పోలింగ్ విధుల పట్ల మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా సాధారణ పరిశీలకులు భారతి లక్ప్తినాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అబ్జర్వర్లకు ఏర్పాటు చేసిన విధివిధానాల శిక్షణ కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని గ్రామపంచాయతీలకు 82 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించామన్నారు. ఎన్నికల నియమావళి అనుసరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను తప్పకుండా అమలు చేయాలన్నారు. ఎంసీసీ, ఎంసీఎంసీ, ఎస్ఎస్‌టీ బృందాల అధికారులతో ఆమె సమీక్షించారు. పోటీచేసే అభ్యర్థులు ప్రకటనల కోసం అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఎస్‌వో రాజిరెడ్డి పాల్గొన్నారు. మెదక్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో నేపథ్యంలో మద్యం, డబ్బు నియంత్రణ చేయాలని ఎన్నికల సాధారణ అబ్జర్వర్ భారతి లక్ప్తినాయక్ అన్నారు. సోమవారం మంబోజిపల్లి చెక్ పోస్టులను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన తనిఖీ వ్యవస్థలు, వాహనాల పరిశీలన, నగదు-వస్తువుల కదలికలపై చేస్తున్న నియంత్రణ చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ పాల్గొన్నారు.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



సఖి కేంద్రంలో సమస్యలపై మాట్లాడుతున్న కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బీ.సౌజన్య ఆదేశించారు. సంగారెడ్డిలోని శిశు గృహ, సఖి కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. శిశు గృహంలోని పిల్లల ఆరోగ్యం పట్ల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం సఖి కేంద్రాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఐఐటీహెచ్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు


ముగింపులో ఖనిజ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, ఐఐటీహెచ్ అధ్యాపకులు

కంది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (ఐఐఎం) 79వ వార్షిక సాంకేతిక సమావేశం సోమవారం ముగిసింది. ఇది దేశంలోని మెటలర్జికల్, మెటీరియల్ సైన్స్ నిపుణుల అత్యంత ముఖ్యమైన సమావేశాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సదస్సులో 1600 మంది ఖనిజాల పరిశోధకులు, శాస్త్రవేత్తలు, 1000 సాంకేతిక పత్రాలు, 110 ఆహ్వానించబడిన చర్చలు, ఏడు దేశాల నుంచి నిపుణులు 45 సంస్థల నుంచి ఆవిష్కరణలను ప్రదర్శించారని ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. ఇది దేశంలోనే పెద్ద సాంకేతిక, లోహ పదార్థాల పరిశోధన పర్యావరణ వ్యవస్థకు కొత్త ప్రమాణాన్ని ఏర్పాటు చేసింది. కీలకమైన ఖనిజాలు, శక్తి పరివర్తన, అధునాతన తయారీపై జాతీయ దృష్టి సారించడంతో ఈ కార్యక్రమం భారతదేశం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగమైంది. జాతీయ ప్రాముఖ్యతను జోడిస్తూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా ఒక ప్రత్యేక సందేశం ఇచ్చారు. కీలకమైన ఖనిజ భద్రత, స్వచ్ఛమైన ఇంధన పరివర్తన, సాంకేతిక స్వావలంబన కోసం భారతదేశం యొక్క ప్రణాళికలకు ఈ సదస్సు కీలకమైనదని ప్రశంసించారు. కీలకమైన పదార్థాల వెలికితీత, శుద్ధి, పునర్వినియోగంలో స్కేలబుల్ పరిష్కారాలను అభివృద్ధి చేయడం ద్వారా సైన్స్, పరిశ్రమలను వారధి చేయాలని ఆయన పరిశోధకులను కోరారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ భారతదేశం పదార్థాల ఆవిష్కరణ, కీలకమైన ఖనిజాల భద్రత స్థిరమైన తయారీ వైపు తన ప్రయాణంలో ఒక నిర్ణయాత్మక క్షణంలో ఉందని కొనియాడారు. సమగ్ర భాగస్వామ్యం, అధిక-నాణ్యత సాంకేతిక సహకారాలు, ప్రపంచ సహకారాలు, స్ఫూర్తిదాయక నాయకత్వంతో, ఐఐటీ హైదరాబాద్ నిర్వహించిన ఈ కార్యక్రమం లోహశాస్త్రం, మెటీరియల్ సైన్స్ అధునాతన సాంకేతికతలలో పెరుగుతున్న ప్రపంచ శక్తి కేంద్రంగా భారతదేశం ఆవిర్భావాన్ని బలోపేతం చేసిందని బీఎస్ మూర్తి వెల్లడించారు

సంక్షిప్తం

బస్వాపూర్‌ను అభివృద్ధే లక్ష్యం
- కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దిన్

వెల్దుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బస్వాపూర్ సర్పంచ్‌గా తన సతీమణి నజ్మాసుల్తానాను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దిన్ పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే బస్వాపూర్‌కు రావడంతో గ్రామస్థులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ మల్లేష్ గౌడ్, మహిపాల్, రాములు, జనార్దన్, అఫ్సర్, సింహం, శేఖర్, భూపాల్, మధు, సుదర్శన్, గణేష్‌లతో పాటు గ్రామస్థులు ఉన్నారు.

నూతన ఆహార విత్తన చట్టాన్ని రద్దు చేయాలి: సీపీఐ

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూతన ఆహార భద్రత విత్తన చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ రహ్మాన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా పిలుపు మేరకు సోమవారం సంగారెడ్డిలో సీపీఐ నాయకులు నూతన విత్తన బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆహార భద్రత విత్తన చట్టంతో రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, సమద్, రమేష్, లక్ష్మి, సుధాకర్, సోమయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో అభివృద్ధికి నిధులు

రామచంద్రాపురం టౌన్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయని కార్పొరేటర్ పుష్పానగేష్ చెప్పారు. ఈ మేరకు సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి కానుకుంటలో రూ.8.50లక్షల అంచనా వ్యయంతో వరదకాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు.కార్యక్రమంలో ఏఈ దివ్య, శ్రీనివాస్‌రాజు, నిరంజన్, శ్రీశైలం, వీరేశం, మల్లేష్, భీమ్‌రావు ఉన్నారు.

కోహీర్ వీరశైవ లింగాయత్ సమాజం నూతన కమిటీ ఎన్నిక

కోహీర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మున్సిపల్ పట్టణ వీరశైవ లింగాయత్ సమాజం నూతన కమిటీని సోమవారం ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరశైవ లింగాయత్ కోహీర్ పట్టణ అధ్యక్షుడిగా నాచం నగేష్, ఉపాధ్యక్షుడిగా బక్క ప్రవీణ్, కార్యదర్శిగా మానేయ్య, సంయుక్త కార్యదర్శిగా నాచం అనిల్, ట్రెజరర్‌గా అక్షయ్ జాడేలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వీరశైవ లింగాయత్ కోహీర్ పట్టణ కార్యవర్గ సభ్యులకు పలువురు శాలువా పూలమాలలతో సన్మానించారు.

వడియారంలో మహా పడిపూజ

చేగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడియారం గ్రామానికి చెందిన రామచంద్రం గురుస్వామి అయ్యప్ప 18వ మహా పడిపూజ పూజారి బాలు గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. మహాపడిపూజకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి హాజరయ్యారు.

ముందుచూపు లేక ప్రజాధనం వృథా





ఖేడ్ మున్సిపాలిటీ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్వీపింగ్ యంత్రం, డ్రైన్ క్లీన్ యంత్రాలు

- ఖేడ్ మున్సిపాలిటీలో పదేళ్ల క్రితం రూ. 50 లక్షలతో ఆధునిక యంత్రాల కొనుగోలు
- పారిశుధ్య కార్మికుల కొరతను అధిగమించేందుకే అని చెబుతున్న అధికారులు
- గుంతల రోడ్లపై పని చేయలేక నిరుపయోగంగా పడిఉన్న స్వీపింగ్ మిషన్, డ్రైన్ క్లీన్ యంత్రాలు

నారాయణఖేడ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అవగాహన లేమి, ముందుచూపు లేని అధికారుల నిర్వాకంతో ప్రజాధనం వృథా అవుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖేడ్ మున్సిపాలిటీలో కార్మికుల కొరతను తట్టుకుని తక్కువ మ్యాన్ పవర్‌తో ఎక్కువ పనులు చేయించాలనే ఆలోచనతో గతంలో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం, డ్రైన్‌క్లీన్ యంత్రాలు తెప్పించారు. అయితే ఇక్కడి పరిస్థితులకు సరిపోతాయో లేదో అనే ముందుచూపు లేకుండానే రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆధునిక యంత్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారడం పలు విమర్శలకు తావిస్తున్నది. వివరాల్లోకి వెళ్తే..

అనువుగా లేని రోడ్లు..

నిరుపయోగంగా మారాయి. దాదాపు పదేళ్ల క్రితం నూతన మున్సిపాలిటీగా ఏర్పడిన నారాయణఖేడ్‌లో అవసరాలకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది లేక పోవడంతో గత పాలకులు పనులను యాంత్రీకరణతో వేగవంతంగా పూర్తి చేసేందుకు రూ.40 లక్షలు వెచ్చించి స్వీపింగ్ యంత్రాన్ని, రూ.10 లక్షలు వెచ్చించి డ్రైన్ క్లీన్ యంత్రాలను కొనుగోలు చేసి తీసుకువచ్చారు. అయితే నారాయణఖేడ్ పట్టణంలో రోడ్లు స్వీపింగ్ యంత్రంతో శుభ్రం చేయించడానికి అనువుగా లేక పోవడంతో పాటు, భారీ వర్షాల వల్ల ఆ రోడ్లపై గుంతలు ఏర్పడడంతో స్వీపింగ్ యంత్రాన్ని వినియోగించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ రోడ్లపై స్వీపింగ్ యంత్రాలను వినియోగిస్తే ప్రయోజనముండదని, అందువల్ల సదరు యంత్రాలను వినియోగించలేక పోతున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. డ్రైన్‌క్లీన్ యంత్రం కూడా నిరుపయోగంగానే ఉంది. ఏదైనప్పటికీ ఎలాంటి ముందుచూపు లేకుండా రూ. లక్షల ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన ఆధునిక యంత్రాలు మున్సిపల్ ఆవరణలో నిరుపయోగంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది.

ఆర్‌వోబీ పనులు వెంటనే ప్రారంభించాలి



తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

తూప్రాన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చేగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జీ (ఆర్‌వోబీ) పనులు వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. సోమవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో చేగుంట ఆర్‌వోబీ నిర్మాణంపై రోడ్లు భవనాలశాఖ, విద్యుత్‌శాఖ, అటవీ, మిషన్ భగీరథ, పోలీసు శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చెట్ల తొలగింపు విషయంలో అవసరమైన వ్యయం రైల్వేశాఖ భరించాలని, అందుకు అనుగుణంగా రైల్వే అధికారులు చర్యలు తీసుకొని వెంటనే పనులు ప్రారంభించాలని అటవీ అధికారులు తెలిపారు. ఆర్‌వోబీ పనుల ప్రాంతంలో వాటర్ పైపులైన్ విషయంలో రైల్వే, మిషన్ భగీరథ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని ఆదేశించారు. పైపులైన్‌ను సురక్షితంగా మూసివేసి పనులు జరుగుతున్న సమయంలో అంతరాయం తలెత్తకుండా చూడాలన్నారు. ఆర్‌వోబీ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి అవసరమైన చర్యలను వేగంగా చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆర్డీవో ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్ అమలు చేయాలని పోలీసుశాఖకు ఆర్డీవో సూచించారు. సమావేశంలో డీఎస్పీ నరేందర్‌రెడ్డి, రోడ్లు భవనాలశాఖ ఈఈ వేణు, మిషన్ భగీరథ ఈఈ సంపత్‌కుమార్, తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, విద్యుత్ శాఖ అధికారులు శ్రీనివాస్, విజయ్, చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు శ్రీధర్, దివ్యశ్రీ, విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన చేసిన అధికారులు

చేగుంట: చేగుంట మండల కేంద్రంలోని మెదక్ రోడ్డులోని 228 రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణం పనుల కోసం రైల్వే శాఖ, ఆర్ అండ్ బీ, అటవీ శాఖ, విద్యుత్, పోలీస్‌శాఖలకు చెందిన అధికారులు స్థలపరిశీలన జరిపారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు నిర్మాణం యొక్క మ్యాపు మార్గాలకు, విద్యుత్ స్తంభాలు, చెట్లు, మిషన్ భగీరథ పైప్‌లైన్ తొలగించేందుకు సంబంధించి అధికారులతో కలిసి రైల్వే అధికారులు పరిశీలించారు.

ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ

పెద్దశంకరంపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పెద్దశంకరంపేటలో సోమవారం ప్రొసీడింగ్ అధికారులకు పేట ఎంపీడీవో షాకీర్ అలీ, తహసీల్దార్ శ్రీనివాస్‌లు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పీవోలకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో క్రాంతికుమార్ పాల్గొన్నారు. కాగా పెద్దశంకరంపేట మండలంలో మొత్తం 61 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా సోమవారం సాయంత్రం వరకు 56 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉపయోగించుకున్నట్లు పేట ఎంపీడీవో, తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

రేగోడు డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని అల్లాదుర్గం సీఐ రేణుక అన్నారు సోమవారం రేగోడు, మర్పల్లి, కొత్వాల్‌పల్లి గ్రామాల్లో పోలింగ్ బూతులనును పరిశీలించి, పంచాయతీ ఎన్నికల అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు జరిగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంట ఎస్సై పోచయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తపస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా దత్తాత్రి



దత్తాత్రి, అధ్యక్షుడు



సుధాకర్, ప్రధాన కార్యదర్శి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దత్తాత్రి, ప్రధాన కార్యదర్శిగా కోట సుధాకర్ ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం మూడేళ్ల పాటు ఉంటుంది.

వైద్యశాఖలో ప్రోగ్రామ్స్ అమలు వంద శాతం జరగాలి



సంగారెడ్డిలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వసంతరావు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ప్రోగ్రామ్స్ వందశాతం అమలు జరగాలని, లేకపోతే సంబంధిత పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లపై శాఖపరమైన చర్యలు తప్పవని సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.వసంతరావు హెచ్చరించారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లతో సోమవారం డీఎంహెచ్‌వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రోగ్రామ్ ఆఫీసర్లందరూ రెగ్యులర్‌గా పీహెచ్‌సీలను సందర్శించి, క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయాలని సూచించారు. అంతకుముందు ఎన్‌సీడీ, టీబీ, ఎన్‌సీహెచ్ కార్యక్రమాలపై జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డా.సునంద, డా.శైలజ, డా.శ్రీనివాసరావు, డీటీసీవో డా.అరుణకుమారి, పీవోడీటీ డా.శశాంక్, ఎన్‌సీహెచ్ పీవో డా.నాగనిర్మల,మలేరియా ఆఫీసర్ డా.ప్రవీణ్, ఎయిడ్స్ అండ్ లెప్రసీ పీవో డా.మహేందర్ రెడ్డి, డీపీహెచ్‌ఎన్‌వో మధులత పాల్గొన్నారు.

కంది పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

కంది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంది పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న మందులు, సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోజువారి రోగుల వివరాలకు సంబంధించిన రికార్డులను, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది వసంతరావును శాలువాతో సన్మానించారు.

ప్రభుత్వ భూమిలో కబ్జాలను అడ్డుకోవాలి

జిన్నారం, డిసెంబరు, 8 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లి ప్రభుత్వ భూమిలో కబ్జాలు చేసి రియల్ వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, ఆస్థులాన్ని రక్షించాలని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం జిన్నారంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున్‌కు కాజీపల్లి వాసులు కలిసి స్థానిక 181 సర్వే నెంబర్ ప్రభుత్వ భూముల కబ్జాలపై ఫిర్యాదు చేశారు. రూ.60 కోట్ల విలువ గల 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి రియల్ వ్యాపారం చేస్తున్నారన్నారు.

పెద్దిరాజు పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు



పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందంపేట గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దిరాజు పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలోని గణపతి పూజ, అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, హోమ పూజలను నిర్వహించారు. గ్రామ దేవతలకు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

చిన్నశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవ్వలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద మహాగణపతి పంచాయత ఆలయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ ప్రారంభించి స్వామి వారి అభిషేకం, కుంకుమార్చన, కలశపూజ నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులకు పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు.

చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి



జహీరాబాద్: చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలను పర్యవేక్షిస్తున్న సంగారెడ్డి జిల్లా ఏఎస్పీ రఘునాథరావు



శివ్వంపేట: పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్

జహీరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎన్నిక నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో తెలగాణ-కర్ణాటక సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తణిఖీలు చేపట్టాలని సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ రఘునాథరావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి, న్యాల్‌కల్ మండలంలోని హుసెల్లీ వద్ద ఏర్పాటుచేసిన సరిహద్దు చెక్‌పోస్టులను ఆయన తనఖీ చేశారు. అలాగే మండలంలోని సత్వార్‌లో గత పలు పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. వెంట పట్టణ సీఐ శివలింగం, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

శివ్వంపేట: పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. స్థానిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ మధుకర్ రెడ్డి ఉన్నారు.

- **కోహీర్:** కోహీర్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయా గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు, సమస్యలు సృష్టించే వారికి కోహీర్ ఎస్ఐ నరేష్ అవగాహన కల్పించారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు అనుమతి లేకుండా పరిధి దాటి వెళ్లకూడదని ఎస్ఐ తెలిపారు.
- **రేగోడు:** ఎన్నికల సందర్భంగా ఎఫ్ఎస్‌టీ టీమ్ ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలు, రహదారులపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆర్ఐ విజయలక్ష్మి, ఏఎస్ఐ శంకర్ ఉన్నారు.

పలు మండలాల్లో పోలీసుల కవాతు

సంగారెడ్డి క్రైం/పటాన్‌చెరు/పాపన్నపేట/పెద్దశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ప్రజల్లో భద్రతా భావాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంది, ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామాల్లో పోలీసులు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు, ఆర్మ్ ఫోర్స్, పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐ క్రాంతి కుమార్, ఎస్ఐ ఎస్.మధుసూదన్‌రెడ్డి, హరిక, రఫీయొద్దిన్ తదితరులు పాల్గొన్నారు. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో సీఐ విజయకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో 50 మందితో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ జార్జ్, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, కొల్చారం,మెదక్ రూరల్ ఎస్సైలు అహ్మద్, లింగం ఉన్నారు. పెద్దశంకరంపేటలో అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అల్లాదుర్గం సర్కిల్ పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, ఎస్ఐలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్, అల్లాదుర్గం సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నతంగా ఎదగాలి



సదాశివపేట డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సదాశివపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి ఉన్నతంగా ఎదగాలని, విద్యే భవిష్యత్తుకు మంచి పునాది వేస్తుందని కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. సోమవారం సదాశివపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించి కళాశాల ఆవరణ, విద్యా, మౌలిక వసతులు, తరగతి గదులు, విద్యార్థుల హాజరు, కోర్సుల నిర్వాహణ తదితర అంశాలను పరిశీలించారు. కలెక్టర్ క్లాస్‌రూమ్‌లలో బోధన తీరును స్వయంగా పరిశీలించి, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వసతి ఉంటే మరింత మంది విద్యార్థులు కాలేజీలో చేరే అవకాశముందని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు అవసరమైన సూచనలు చేశారు. వెంట తహసీల్దార్ బాల్‌రాజ్, కళాశాల అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా బాలల సంరక్షణాధికారి రాద్వ రత్నం

కంది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అపరిచితులతో బాలికలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణా అధికారి రాద్వ రత్నం పేర్కొన్నారు. కంది మండలంలోని చేర్యాల జడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం బాలల సంరక్షణ, భద్రతపై ఆయన, సఖీ సెంటర్ కవిత, చైల్డ్ హెల్ప్‌లైన్ నవీన్, ఇంద్రకరణ్ పోలీసు స్టేషన్ జమేదార్ ఘనీ, సంధ్యారాణిలు విద్యార్థులకు వివిధ రకాల ప్రమాదాల గురించి సంరక్షణ, భద్రతపై అవగాహన కల్పించారు. ప్రొజెక్టర్ ద్వారా వివిధ రకాల మోసాలు, నేరాలు ఎలా జరుగుతున్నాయో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెలను ఆగం చేసుకోవద్దు



గాంధారిపల్లిలో మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు

పాపన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డబ్బు, మద్యానికి ఆశపడి పల్లెలను ఆగం చేసుకోవద్దని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే సూచించారు. సోమవారం పాపన్నపేట మండల పరిధిలోని గాంధారిపల్లి, జయపురం, అన్నారం, అబ్లపూర్, ఆరెపల్లి, కుర్తివాడ, మిన్‌పూర్, రాంతీర్థం, లింగాయిపల్లి, చికోడ్, కొంపల్లి, దౌలాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలన్నా, గ్రామ సమస్యలు పరిష్కారం కావాలన్నా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను మాత్రమే గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. అర్హులందరికీ సంక్షేమపథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కాగా ఆయా గ్రామాల్లో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాలలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్ ఆయా గ్రామాల సర్పంచ్, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలకు మోసపోవద్దు



బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

పాపన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాయమాటలకు ప్రజలు మరోసారి మోసపోవద్దని మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, మాజీ మ్మెల్యే శశిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాపన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నుంచి సర్పంచ్, వార్డు స్థానానికి బరిలో ఉన్న అభ్యర్థుల గెలుపు కోసం కొడపాక, శేరిపల్లి, బాచారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థానిక సంస్థలకు జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పి బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో కొడపాక మాజీ సర్పంచులు సంగప్ప, వెంకట్ రాములు మాజీ ఎంపీటీసీ చారి, నాయకులు దుర్గయ్య దత్తు, శ్రీనివాస్ గౌడ్ , బాలయ్య, దావిడ్, చాన్ బాషా, సాయి వర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

గుమ్మడిదల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల నాయకులు తిరిగి సొంతగూటికి చేరారు. మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ భర్త సద్ది విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఎండీ.హుస్సేన్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాటి నుంచి ఆ పార్టీలో ఎలాంటి క్రియాశీలక పాత్ర పోషించకుండా కార్యక్రమాలకు పాల్గొనకుండా దూరంగా ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్ చేస్తున్న కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ వచ్చారు. సోమవారం హరీశ్‌రావు సమక్షంలో ఆ ముగ్గురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మాజీమంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి, రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జీ.వెంకటేష్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు

- **మనూరు:** మనూరు మండలం పుల్‌కుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీల నుంచి దాదాపు 50 మంది వరకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తుకారం, పుట్టిపోషాల్, పుట్టి నర్సింలు, సుభాష్, నాని, హీర్, చాకలి అడవిరాజ్, వారి అనుచరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

పటాన్‌చెరు డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పటాన్‌చెరు మైత్రీ మైదానం, సింఫనీహోమ్స్, కృషి డిఫెన్స్ కాలనీల్లో రూ.66లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లను కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో సైతం మార్పుకోవాలన్నారు. వ్యాయామం నిత్య ప్రక్రియగా మార్చుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం అన్ని కాలనీల్లో ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయాలని సంకల్పించిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చందాపూర్ పాఠశాలలో బడి తోట

చిన్నశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలంలోని చందాపూర్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు బడి తోట కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బడితోట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సేంద్రియ ఎరువులతో పండించే విధానంపై అవగాహన కల్పించి, పలు కూరగాయలు, ఆకు కూరల మొక్కలను నాటామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.